
సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం । 10 । సెప్టెంబర్ । 2025



15న ఎంజీయూ స్నాతకోత్సవం

ఎంజీయూలో 15న స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు వైస్ చాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. - 8లో



సాయుధ పోరాటం ద్వారానే..

నాటి సాయుధ పోరాటంతోనే ఈ ప్రాంత ప్రజలకు స్వేచ్ఛ లభించిందని సీపీఎం నేత బీవీ రాఘవులు అన్నారు. - 8లో



ప్రజాప్రతినిధుల పర్యటన

ఉత్తరప్రదేశ్‌కు చెందిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు వెల్లంకి, దేవలమ్మనాగారం గ్రామాన్ని సందర్శించారు. - 8లో

న్యూస్‌రీల్

నేడు తాగునీటి సరఫరా నిలిపివేత

భువనగిరిటౌన్ : గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లయ్ ఫేజ్–1లోని కొండపాక పంపింగ్ స్టేషన్ వద్ద ఉన్న 3000 ఎంఎం డయా ఎంఎస్ పంపింగ్ మెయిన్‌కు 900 ఎంఎం డయా వాల్వ్‌లు అమర్చనుండడంతో బుధవారం మంచి నీటి సరఫరా బంద్ చేస్తున్నట్లు మిషన్ భగీరథ భువనగిరి డివిజన్ కార్యనిర్వహణ ఇంజనీర్ కరుణాకరణ్ మంగళవారం తెలిపారు. భువనగిరి నియోజకవర్గంలోని భువనగిరి, బీబీనగర్, వలిగొండ, రామన్నపేట (8 గ్రామాలు), పోచంపల్లి (16 గ్రామాలు, మున్సిపాలిటీ కింద కొత్తగా చేరిన 9గ్రామాలు) మండలాలు, ఆలేరు నియోజకవర్గం లోని రాజాపేట, ఆత్మకూరు, యాదగిరిగుట్ట, ఆలేరు, గుండాల, తుర్కపల్లి, మోటకొండూరు, బొమ్మలరామారం మండలాల్లో నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

క్షేత్రపాలకుడికి నాగవల్లి దళార్చన

యాదగిరిగుట్ట: యాదగిరి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి క్షేత్రపాలకుడిగా ఉన్న ఆంజనేయస్వామికి అర్చకులు మంగళవారం ఆకుపూజను విశేషంగా నిర్వహించారు. ఆంజనేయస్వామికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయంతో పాటు విష్ణు పుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయాల్లో స్వామివారికి సింధూరంతోపాటు పాలతో అభిషేకం జరిపించారు. ఆంజనేయస్వామిని పూలతో అలంకరించి, నాగవల్లి దళార్చన చేపట్టారు. ఆయా పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. ఇక.. ఆలయంలో శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం నిర్వహించారు. సాయంత్రం వెండి జోడు సేవ పూజలు కొనసాగాయి.

విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించాలి



మాట్లాడుతున్న జినుకల శ్యాంసుందర్

భువనగిరిటౌన్ : వసతి గృహాల్లో ఈ నెల 13న విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేయాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి జినుకల శ్యాంసుందర్ అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో జిల్లాలోని సహాయ షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాల నిర్వహణ, విద్యార్థుల ప్రగతిపై సమీక్షించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలన్నారు. సమావేశంలో సహాయ సంక్షేమ వసతి గృహాల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా అమలైన 100 రోజుల కార్యాచరణ



మాట్లాడుతున్న సీడీఓ హేమలత

భువనగిరిటౌన్ : మున్సిపాలిటీల్లో 100 రోజుల కార్యాచరణ పకడ్బందీగా అమలైందని సీడీఓ హేమలత తెలిపారు. 100 రోజుల ముగింపు కార్యక్రమంలో భాగంగా మంగళవారం భువనగిరి మున్సిపాలిటీని ఆమె సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ రామలింగం ఆధ్వర్యంలో 100 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రకారం చేసిన కార్యక్రమాల గురించి అన్ని విభాగాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ రిసోర్స్ పార్క్ డంపింగ్ యార్డ్‌ను వర్మీ కంపోస్టింగ్ ప్రాసెస్, పొడి చెత్తను రీసైక్లింగ్ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏబీసీ సెంటర్ (యానిమల్ బర్త్ కంట్రోల్ సెంటర్)ను సందర్శించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన సీఎస్‌సీ సెంటర్‌ను పరిశీలించారు. ఆమె వెంట మున్సిపల్ అధికారులు సిబ్బంది ఉన్నారు.

ప్రాజెక్టుల పూర్తికి ప్రణాళికలు



ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులపై హైదరాబాద్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ ఐలయ్య, అధికారులు

2027 నాటికి ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తి

- బ్రాహ్మణవెల్లెంల, డిండి, పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని ప్రాజెక్టులూ పూర్తి చేస్తాం
- ఉమ్మడి నల్లగొండ జిల్లా ప్రాజెక్టులపై సమీక్షలో మంత్రి ఉత్తమ్
- చివరి దశలోని ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని కోరిన గుత్తా
- జిల్లాకు రూ.10వేల కోట్లు కేటాయించాలన్న మంత్రి కోమటిరెడ్డి

సాక్షి, హైదరాబాద్, సాక్షి,యాదాద్రి: ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి వెల్లడించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును 2027 డిసెంబర్ నాటికి పూర్తి చేసేందుకు రూట్‌మ్యాప్ రూపొందించామన్నారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం పనుల పునరుద్ధరణలో భాగంగా ఎయిర్‌బోర్న్ హెలికాప్టర్ సర్వే నిర్వహించబోతున్నామన్నారు. పనుల పునరుద్ధరణపై ఇంజనీర్లు రూపొందించిన నివేదికపై ఈ నెల 15న మంత్రివర్గ సమావేశంలో చర్చించి ఆమోదించిన తర్వాత పనులు పునఃప్రారంభిస్తామన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులపై మంగళవారం ఆయన హైదరాబాద్‌లోని జలసౌధలో శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఆర్అండ్‌బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులతో కలిసి సమీక్షించి మాట్లాడారు. ఎస్ఎల్‌బీసీ సొరంగం–1, పెండ్లిపాకల రిజర్వాయర్, సొరంగం–2ను పూర్తి చేసి 25 కి.మీ. ప్రధాన కాల్వ ద్వారా హైలెవల్ కాల్వకు నీళ్లను తరలించి సాగునీరు అందిస్తామన్నారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు పూర్తయితే హైలెవల్ కాల్వ కింద 2.2లక్షలు, ఉదయసముద్రం కింద లక్ష, లోలెవల్ కాల్వ కింద 80వేల ఎకరాలు కలిపి మొత్తం 4లక్షల ఎకరాలకు సాగునీటితో పాటు మారుమూల గ్రామాలకు తాగునీరు అందిస్తామన్నారు. డిండి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి ఎనిమిది జలాశయాల కింద 3.61లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని అందించేందుకు పనులు కొనసాగుతున్నాయన్నారు.

ముంపు బాధితుల పరిహారం రూ.70 కోట్లు కావాలి

నృసింహసాగర్(బస్వాపూర్ రిజర్వాయర్) రిజర్వాయర్ ముంపు గ్రామాలకు పరిహారం కోసం రూ. 109 కోట్లు అవసరం అవుతాయి. ప్రధానంగా బీఎన్ తిమ్మాపూర్ గ్రామం పూర్తిగా మునిగిపోతుంది. ఇప్పటి వరకు రూ.30 కోట్లు చెల్లించారు. ఇంకా రూ.70 కోట్లు చెల్లించాల్సి ఉంది. వీరికి పరిహారం చెల్లిస్తేనే రిజర్వాయర్‌లో నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. అలాగే భూ సేకరణ కోసం రూ. 200కోట్లు అవసరం అవుతాయి. ఇప్పటికే భూ సేకరణకోసం ప్రభుత్వం రూ.481 కోట్లు చెల్లించింది. రిజర్వాయర్ నిర్మాణం, కాలువలు తవ్వడానికి రూ. 1685 కోట్లు ఖర్చు చేసింది.

పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టులోని ఏదుల రిజర్వాయర్ నుంచి దుందుభి వాగు వరకు నీళ్లను తరలించే ప్రాజెక్టు పనులను ఐదు ప్యాకేజీలుగా విభజించి చేపట్టామన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఉమ్మడి నల్లగొండ జిల్లాలో 11 ఎత్తిపోతల పథకాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని, వీటితో 15వేల ఎకరాల స్థిరీకరణ, 14,506 ఎకరాల కొత్త ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు. ఉదయసముద్రం ప్రాజెక్టును పూర్తి చేయడానికి ప్రత్యేక దృష్టి సారించామన్నారు. పిలాయిపల్లి, ధర్మారెడ్డిపల్లి, బునాదిగాని కాల్వలను త్వరలో పూర్తిచేస్తామన్నారు. 93శాతం పూర్తైన బస్వాపూర్ రిజర్వాయర్‌ను పూర్తి చేసి 23వేల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. గంధమల్ల రిజర్వాయర్ పరిధిలోని రావెల్ కోల్ లింక్ కెనాల్, ప్యాకేజ్–16, తుర్కపల్లి కెనాల్ పనులూ పూర్తి చేస్తామన్నారు.

రూ.120కోట్లు విడుదల చేయాలి

జిల్లాలోని సాగు నీటి ప్రాజెక్టులపై మంత్రులు నిర్వహించిన సమావేశంలో నృసింహసాగర్ రిజర్వాయర్ ముంపు నిర్వాసితులకు, గంధమల్ల రిజర్వాయర్ కట్ట పనులకు విడతల వారీగా నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అత్యవసరంగా రూ.120కోట్లు విడుదల చేయాలని మంత్రి ఉత్తమ్‌ను కోరారు. గంధమల్ల రిజర్వాయర్ కట్ట పనులు వెంటనే ప్రారంభించడానికి రూ.27 కోట్లు అవసరమవుతాయని, ఈ నిధులు వెంటనే మంజూరు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా కలెక్టర్ హనుమంతరావు ప్రాజెక్టు కావాల్సిన నిధుల వివరాలు మంత్రులకు సమర్పించారు. రూ.575.57 కోట్లతో చేపట్టి గంధమల్ల రిజర్వాయర్ పూర్తి అయితే 63వేల ఎకరాలకు సాగు నీటి వసతి లభిస్తుంది. రిజర్వాయర్ నిర్మాణానికి 994.37 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉంది. ఇందుకోసం రూ.250కోట్లు అవసరమవుతాయి. అయితే తొలి విడతలో కట్టను 2.95 కిలోమీటర్ల పొడవు బలోపేతం చేయడానికి 112 ఎకరాల భూసేకరణ చేశారు. ఇందుకోసం రూ. 27 కోట్లు పరిహారం చెల్లించాల్సి ఉంది. నిధులు లేకపోవడంతో పరిహారం చెల్లింపు నిలిచిపోయింది. సుమారు 330 మంది రైతులకు పరిహారం ఇవ్వాల్సి ఉంది.

దళితుల ద్రోహిగా మిగిలిన కేసీఆర్

- ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య
- గతంలో కేసీఆర్ చేసిన వర్టూర్ గ్రామంలోనే పల్లెనిద్ర చేసిన ఎమ్మెల్యే



దళిత వాడలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

మోటకొండూర్: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులను పూర్తిగా విస్మరించి పాలన సాగించి దళిత ద్రోహిగా మిగిలారని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఆరోపించారు. మంగళవారం మోటకొండూర్ మండలంలోని వర్టూర్ గ్రామంలోని దళిత వాడలో ఆయన పల్లె నిద్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2009 తెలంగాణ ఉద్యమ సమయంలో మోటకొండూర్ మండలంలోని వర్టూర్ గ్రామంలోని దళిత వాడలో కేసీఆర్ పల్లె నిద్ర నిర్వహించారని గుర్తు చేశారు. రాష్ట్రం సిద్ధిస్తే 60 దళిత కుటుంబానికి డబుల్ బెడ్ రూం ఇళ్లు, రూ.5 వేల నగదు ఇస్తామని హామీలు అమలు చేయకుండా పూర్తిగా విస్మరించారని విమర్శించారు. అదే దళితవాడలో కేసీఆర్ పల్లెనిద్ర చేసిన ఇంటి వద్దే తాను పల్లె నిద్ర చేసి దళితులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. దళిత వాడలో అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం వారితో కలిసి సామూహిక సహపంక్తి భోజనాలు చేశారు. కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య, ఆలేరు నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఈరసరపు యాదగిరిగౌడ్, మండల అధ్యక్షులు గంగాపురం మల్లేష్, పచ్చిమట్ల మదార్‌గౌడ్, నెమ్మాణి సుబ్రమణ్యం, తండ రంగయ్య గౌడ్, కొంతం మోహన్‌రెడ్డి, మోర శ్రీనివాస్‌రెడ్డి, పల్లె శ్రీనివాస్, భూమండ్ల శ్రీనివాస్, బుగ్గ కొమురయ్య, జూకంటి మధు, గువ్వ హరిబాబు, పేరబోయిన కార్తీక్, బుగ్గ శ్రీశైలం, వంగాల మల్లేష్‌గౌడ్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేటి నుంచి సాయుధ పోరాట వారోత్సవాలు

మిర్యాలగూడ : తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను బుధవారం నుంచి ఈనెల 17వరకు నిర్వహిస్తున్నట్లు సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మంగళవారం మిర్యాలగూడలోని సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1969లో భూస్వాములు, రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన సాయుధ పోరాటం చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు. దీంట్లో భాగంగా ఈనెల 11న మిర్యాలగూడ మండలం గూడూరు గ్రామంలో అమరవీరుల కుటుంబాల సన్మాన కా కార్యక్రమానికి సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం హాజరవుతున్నట్లు తెలిపారు. ఈనెల 17న నల్లగొండలో నిర్వహించే ముగింపు సభకు పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కరత్ రానున్నారని పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, ముడావత్ రవినాయక్, అయూబ్, మల్లు గౌతంరెడ్డి, బావండ్ల పాండు, లక్ష్మీనారాయణ, సత్యనారాయణ, గోవర్ధని పాల్గొన్నారు.

స్వచ్ఛ పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలి

- డీఈఓ సత్యనారాయణ



మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

భువనగిరి: జిల్లాలోని పాఠశాలలు స్వచ్ఛ, హరిత పురస్కారాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ సత్యనారాయణ తెలిపారు. మంగళవారం భువనగిరి మండలంలోని రాయగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఎంఈఓలు, మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాఠశాలల్లో పచ్చదనం, పరిశుభ్రత, తాగునీరు, నీటి వినియోగం, విద్యార్థుల పరిశుభ్రత, మరుగుదొడ్ల నిర్వహణ, మొదలైన అంశాలపై రేటింగ్ ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛ ఏవం కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. దేశ వ్యాప్తంగా 200 పాఠశాలలను ఎంపిక చేసి పురస్కారాలు ఇస్తుందని తెలిపారు. జాతీయ స్థాయిలో ఎంపికైన ఒక్కో పాఠశాలలకు రూ. లక్ష చొప్పున ప్రోత్సాహక బహుమతి అందజేస్తుందని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న 875 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు స్వచ్ఛ పురస్కారాల ఎంపిక కోసం ఈ నెల 30వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. కలెక్టర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కమిటీలు అక్టోబర్‌లో తనిఖీలు చేస్తామని చెప్పారు. ప్రస్తుతం శిక్షణ పొందుతున్న ఎంఈఓలు, మాస్టర్ ట్రైనర్లు మండల స్థాయిలోని ప్రధానోపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి పెసరు లింగారెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు అండాలు, జిల్లా మాస్టర్ ట్రైనర్ కృష్ణప్రసాద్, ఎంఈఓలు పాల్గొన్నారు.

కాళోజీ నారాయణరావుకు నివాళి



కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

భువనగిరిటౌన్ : కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో మంగళవారం తెలంగాణ ప్రజాకవి, పద్మ విభూషణ్ కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి జిల్లా రెవెన్యూ అధికారి జయమ్మ నివాళులర్పించారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి జినుకల శ్యామ్ సుందర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నాగిరెడ్డి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్మోహన్ ప్రసాద్, డి సెక్షన్ సూపరింటెండెంట్ బ్రహ్మయ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

యాదాద్రి ప్లాంట్ నుంచి విద్యుత్ సరఫరా ప్రారంభం

- చౌటుప్పల్ వద్ద టవర్లకు 400కేవీ లైన్ ద్వారా సరఫరా
- తీగలను తాకకుండా రైతులు జాగ్రత్తగా ఉండాలి
- ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్‌కుమార్ సూచన



యాదాద్రి పవర్ ప్లాంట్

నిడమనూరు : యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్ నుంచి చౌటుప్పల్ వద్ద (92.378 కిలోమీటర్ల దూరం) ఉన్న విద్యుత్ టవర్లకు మంగళవారం కేబుల్ లైన్ ద్వారా విద్యుత్ సరఫరా ప్రారంభించినట్లు ట్రాన్స్‌కో ఏఈ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యధికంగా నిడమనూరు మండల పరిధిలోని రైతులు వరిపొలాల మీదుగా వెళ్తున్న 400 కేవీ విద్యుత్ లైన్ తీగలను తాకవద్దని సూచించారు. ఈ లైన్ మొత్తం దామరచర్ల మండలంలో తిమ్మాపురం, వీర్లపాలెం, త్రిపురారం మండలంలో అంజనపల్లి, నీలాయిగూడెం, అన్నారావుక్యాంపు, రాగడప, నిడమనూరు మండలం నిడమనూరు, బంకాపురం, శాఖాపురం, పార్వతీపురం, రాజన్నగూడెం, నారమ్మగూడెం, వెనిగండ్ల, పనసయ్య క్యాంపు, తుమ్మడం, అనుముల మండలంలో మారేపల్లి, నారాయణపురం, యాచారం, కుపాసిపల్లి, పాలెం, రామడుగు, శ్రీనాథపురం, చింతగూడెం, గుర్రంపోడు మండలంలో కొప్పోలు, కనగల్ మండలంలో రేగట్టే, కుర్రంపల్లి, జీ ఎడవెల్లి, పానుగోడు, కనగల్, గొరారం, తుర్కపల్లి, లచ్చుగూడెం, చండూరు మండలంలోని ఉడుతలపల్లి, బోడంగిపర్తి, మునుగోడు మండలంలోని పాల్వాయి, కిష్టాపురం, ఇప్పర్తి, చీకటిమామిడి, మునుగోడు, కమ్మగూడెం, చొల్లేడు, సోలిపురం, కొరటికల్ నుంచి చిట్యాల మీదుగా చౌటుప్పల్ వరకు 92.378 కిలోమీటర్ల పొడవున ఉందన్నారు. ఆయా గ్రామాల ప్రజలు విద్యుత్ టవర్ల వద్ద జాగ్రత్తగా ఉండాలని, టవర్లను ఎక్కకూడదని, టవర్ల కింద ఏపుగా పెరిగే మొక్కలు నాటవద్దని పేర్కొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ఉండాలి



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్

భువనగిరి: ఎయిడ్స్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ అన్నారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో భువనగిరి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూత్ ఫెస్ట్–2025, 5కే రెడ్ రన్ నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలల్లో ఎయిడ్స్‌పై అవగాహన కల్పించేందుకు క్విజ్ వంటి పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్ తెలిపారు. అంతకుముందు 5కే రెడ్ రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ సాయిశోభ, సంపతయ్య, ముత్యాలు, చంద్రమౌళి, సతీష్, నర్సింహ, ప్రిన్సిపాల్ కరుణాకర్‌రెడ్డి, పీడీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

హెపటైటిస్ 'బి' వ్యాక్సిన్‌తో వ్యాధుల నుంచి రక్షణ

హెపటైటిస్ 'బి' వ్యాక్సిన్‌తో జీవితకాల కాలేయ సంబంధిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మనోహర్ తెలిపారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హెపటైటిస్ బి వ్యాక్సిన్ జిల్లా కేంద్ర ఆస్పత్రితో పాటు కమ్యూనిటీ హెల్త్‌సెంటర్లలో అందుబాటులో ఉందన్నారు. సమావేశంలో ప్రోగ్రాం ఆఫీసర్ సాయిశోభ, డాక్టర్ యశోధ, మధురిమ, స్వప్నరాథోడ్, సృజన, సందీప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలగానే వంతెన నిర్మాణం

- కొలనుపాక వాగుపై శిథిలావస్థకు చేరిన కాజ్‌వే
- బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరై రెండేళ్లు గడుస్తున్నా ప్రారంభం కాని పనులు
- ఏటా వర్షాకాలంలో తప్పని అవస్థలు



వాగులో కొట్టుకుపోతున్న వాహనదారులను రక్షిస్తున్న స్థానికులు (ఫైల్)

ఆలేరురూరల్: కొలనుపాక వాగుపై దశాబ్దాల నాటి కాజ్‌వే శిథిలావస్థకు చేరుకుంది. సుమారు 100 మీటర్లు ఉన్న కాజ్‌వే పూర్తిగా దెబ్బతింది. వర్షాకాలంలో వాగు ఉధృతంగా ప్రవహించినప్పుడు కాజ్‌వే మీదుగా నీరు ప్రవహించి కొన్ని రోజుల వరకు రాకపోకలు స్తంభిస్తాయి. వాహనాలతో కాజ్‌వేపై జారిపడి ప్రమాదాలు చోటు చేసుకున్న సంఘటనలు కూడా ఉన్నాయి.

రూ.4.50 కోట్లు మంజూరు

రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం వంతెన నిర్మాణానికి రూ.4.50 కోట్లు మంజూరు చేసింది. ప్రభుత్వం మారడంతో ఏడాది క్రితం జీహెచ్‌కే సంస్థతో టెండర్ అగ్రిమెంట్ జరిగింది. ఏడు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఉపరితలం మీదుగా నీటి ప్రవాహం ఉన్నా తట్టుకునేలా 3.5 మీటర్ల ఎత్తులో వంతెన నిర్మించాలి. బ్రిడ్జి నిర్మాణాన్ని 15 నెలల వ్యవధిలో పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌తో ఒప్పందం చేసుకున్నారు. అయితే ఇంతవరకు ఎలాంటి పనులు ప్రారంభం కాలేదు.

పలు జిల్లాలకు ప్రధాన మార్గం

కొలనుపాక రాఘవాపురం బైరాంనగర్, గ్రామాల్లో సుమారు 2500 కుటుంబాల వారు నివసిస్తున్నారు. వీరంతా తమ అవసరాల నిమిత్తం ఆలేరు పట్టణానికి వచ్చి వెళ్తుంటారు. అంతేకాకుండా రాజాపేట, జనగాం జిల్లా బచ్చెనపేట, పోచన్నపేట, చేర్యాల, సిద్దిపేటకు ఇది ప్రధాన మార్గం. నిత్యం వందలాదిగా వాహనాలు కాజ్‌వేపై నుంచే రాకపోకలు సాగిస్తుంటాయి.

వంతెన నిర్మాణం చేపడుతాం

కొలనుపాక వాగుపై వంతెన నిర్మాణానికి కాంట్రాక్టర్‌తో ఒప్పందం జరిగింది. నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోంది వాస్తవమే. కొన్ని సాంకేతిక కారణాల వల్ల ఆలస్యం అవుతోంది. అతి త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. ప్రమాదాలు జరగకుండా తాత్కాలిక మరమ్మతులు చేపడుతాం.

– బాలప్రసాద్, ఈఈ ఆర్అండ్‌బీ, భువనగిరి డివిజన్

జరిగిన ప్రమాద ఘటనలు ఇలా..

- కొలనుపాకకు చెందిన ధర్మ శ్రీనివాస్‌రెడ్డి తన బైక్‌పై సాయంత్రం సమయంలో ఆలేరు నుంచి కొలనుపాకకు వెళ్తుండగా నీటి ప్రవాహానికి జారిపడి తీవ్రగాయాలపాలయ్యాడు.
- బచ్చనపేటకు చెందిన వృద్ధ దంపతులు ద్విచక్ర వాహనంపై వాగు దాటుతుండగా నీటి ఉధృతికి వంతెన నుంచి దిగువకు పడిపోయారు. అదేవిధంగా ప్రయాణికులతో వెళ్తున్న కొలనుపాకకు చెందిన ఆటో వరద ప్రవాహానికి కొట్టుకుపోయింది. ఆటో ఉన్న ప్రయాణికులకు గాయపడ్డారు.
- ఉపాధ్యాయురాలు స్కూటీపై ఆలేరుకు వస్తూ వాగుదాటే క్రమంలో కొంతదూరం కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి.

వాగు దాటలేకపోతున్నాం



ప్రతి సంవత్సరం వానా కాలం కొలనుపాక వాగు వచ్చినప్పుడు ఇబ్బందులు పడుతున్నాం, ఆటోలో స్కూల్ విద్యార్థులతో వాగు దాటే క్రమంలో బయపడుతున్నాం, ఏ చిన్న పనికైనా ఆలేరు పట్టణానికి వెళ్లాలి. ఏళ్ల నుంచి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని అధికారులు, నాయకులను వేడుకుంటున్నాం ఓట్ల కోసం వస్తారే తప్పా.. సమస్యను పట్టించుకోరు.

– దూడల కృష్ణ, కొలనుపాక

ఎమ్మెల్యే చొరవ చూపాలి



కొలనుపాక నుంచి సిద్దిపేటకు ప్రధాన రహదారిగా ఉంది. వాగు దాటే క్రమంలో వాహనాలు జారిపడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ప్రజాప్రతినిధులు గతంలో హామీలిచ్చినా నీటి మూటలాగే మిగిలిపోయాయి. స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య చొరవ తీసుకొని వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– గడ్డ నాగరాజు కొలనుపాక

మండుతున్న ఎండలు

- గత నాలుగు రోజుల నుంచి క్రమంగా పెరుగుతున్న ఉష్ణోగ్రతలు
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం

ఈనెలలో నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు (డిగ్రీలలో)

తేదీ	కనిష్ట	గరిష్ట
6వ తేదీ	30.4	35.8
7	29.3	35.1
8	30.7	36.0
9	30.6	37.3



భువనగిరి: వర్షాకాలంలో ఎండాకాలాన్ని తలపించేలా భానుడు తనప్రతాపాన్ని చూపిస్తున్నాడు. గత నాలుగు రోజులుగా ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎండవేడిమితో జనం ఇబ్బందులు పడుతున్నారు. సాధారణంగా వర్షాకాలంలో కనిష్టంగా 25 డిగ్రీలు, గరిష్టంగా 29 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కావాల్సి ఉంటుంది. కానీ ప్రస్తుతం ఉపరితల ఆవర్తన ద్రోణి కొనసాగుతుండడంతో కనిష్ట ఉష్ణోగ్రతలు 30 డిగ్రీలు ఉండగా గరిష్ట ఉష్ణోగ్రతలు 37.3 డిగ్రీల వరకు నమోదు అవుతున్నాయి.

తగ్గని ఉక్కపోత

భారీ వర్షాలు కురిసి మందగించిన తర్వాత కూడా ఉక్కపోత ఏమాత్రం తగ్గలేదు. సెప్టెంబర్‌లోనూ ఏసీలు, కూలర్లను, ఫ్యాన్లు వాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఎండలకు బయటకు వెళ్లాలంటే జనం భయపడుతున్నారు. మరో వైపు ఉక్కపోతతో ఒక్కరిబిక్కరి అవుతున్నారు.

క్లుప్తంగా

లారీల్లో నుంచి డీజిల్ అపహరణ

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్‌లో, సీతరాంపురం గ్రామ స్టేజీ దగ్గర నిలిపి ఉంచిన లారీల్లో నుంచి సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డీజిల్ అపహరించారు. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్‌లో సీతరాంపురం గ్రామానికి చెందిన గన్నా ప్రసాద్ తన లారీని నిలిపి ఉంచగా.. సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు లారీ డీజిల్ ట్యాంక్ మూతలు తొలగించి 200 లీటర్ల డీజిల్ అపహరించారు. అదేవిధంగా సీతరాంపురం గ్రామ స్టేజీ దగ్గర నిలిపిన అదే గ్రామానికి చెందిన గన్నా ప్రవీణ్ లారీలో నుంచి 400 లీటర్లను డీజిల్‌ను ఎత్తుకెళ్లారు. బాధితులు మంగళవారం చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ సురేష్‌రెడ్డి తెలిపారు. ఇటీవల చిలుకూరు మండల పరిధిలోని హుజూర్‌నగర్ ముక్యాల కాలువ దగ్గర లారీ గ్యారేజ్ దగ్గర ఆగి ఉన్న లారీల్లో కూడా డీజిల్ చోరీకి గురైనట్లు తెలిసింది.

విద్యార్థి అదృశ్యం


శ్రీకాంత్

చౌటుప్పల్ రూరల్: చౌటుప్పల్ మండల పరిధిలోని మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ పాఠశాల నుంచి విద్యార్థి అదృశ్యమయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ముషీరాబాద్ మహాత్మా జ్యోతిబా పూలే బీసీ వెల్ఫేర్ బాలుర పాఠశాలను కొంతకాలంగా చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేట గ్రామ పరిధిలోని నేతాజీ ఇంజనీరింగ్ కళాశాల భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ పాఠశాలలో గద్వాల్ జిల్లా లతిపురం గ్రామానికి చెందిన గొల్లతిప్పడంపల్లి శ్రీకాంత్ 7వ తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఉదయం 9గంటలకు పాఠశాల ప్రారంభమైయ్యే సమయానికి శ్రీకాంత్ కనిపించలేదు. హాస్టల్ చుట్టుపక్కల ఎంత వెతికినా అతడి ఆచూకీ లభించకపోవడంతో హిందీ టీచర్ ఖారత్మల్ దయవంతి చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్‌ఐ ఉపేందర్‌రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

మతిస్థిమితం లేని యువకుడు..


మధుకిరణ్‌రెడ్డి

మిర్యాలగూడ టౌన్: మతిస్థిమితం లేని యువకుడు అదృశ్యమైన సంఘటన మంగళవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మిర్యాలగూడ రూరల్ ఎస్‌ఐ మల్లికంటి లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ మండలం తడకమళ్ల గ్రామానికి చెందిన దేవిరెడ్డి మధుకిరణ్‌రెడ్డి తండ్రి గతేడాది మృతిచెందగా.. అప్పటి నుంచి మనోవేదనతో మతిస్థిమితం కోల్పోయాడు. గత నెల 27న మధుకిరణ్‌రెడ్డి తన అమ్మమ్మ ఊరైన త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి కనిపించకుండా పోయాడు. ఎంత వెతికినా మధుకిరణ్‌రెడ్డి ఆచూకీ లభించకపోడంతో అతడి తల్లి పద్మ మంగళవారం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రేమ పేరుతో వేధింపులు

- యువకుడిపై కేసు నమోదు

చౌటుప్పల్ రూరల్: యువతిని ప్రేమ పేరుతో వేధిస్తున్న యువకుడిపై చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌటుప్పల్ మండలం కుంట్లగూడెం గ్రామ పంచాయతీకి చెందిన యువతి రంగారెడ్డి జిల్లా నార్సింగిలోని ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతోంది. అదే గ్రామానికి చెందిన మల్లెబోయిన శశిధర్ ప్రేమ పేరుతో ఆ యువతిని వేధించడంతో ఆరు నెలల క్రితం గ్రామంలో పంచాయితీ పెట్టి మందలించారు. గత 15 రోజులుగా శశిధర్ తిరిగి యువతి వెంట పడుతూ తనను పెళ్లి చేసుకోవాలని, లేదంటే చంపుతానని బెదిరింపులకు పాల్పడుతున్నాడు. దీంతో సదరు యువతి మంగళవారం చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు ఎస్‌ఐ అజయ్ భార్గవ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు.

సాయుధ పోరాటం ద్వారానే స్వేచ్ఛ

- వాస్తవాలు వక్రీకరిస్తే తిరుగుబాటు తప్పదు
- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు


సదస్సులో మాట్లాడుతున్న బీవీ రాఘవులు

భువనగిరిటౌన్ : ఆనాడు తెలంగాణ రైతాంగం చేసిన సాయుధ పోరాటం ద్వారానే ఈ ప్రాంత ప్రజలకు స్వేచ్ఛ లభించిందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు అన్నారు. మంగళవారం భువనగిరి పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ జహంగీర్ అధ్యక్షతన నిర్వహించిన ప్రజా సదస్సులో రాఘవులు పాల్గొని మాట్లాడారు. ఆనాడు భూస్వాముల దౌర్జన్యాలు శృతిమించడంతో తెలంగాణ సాయుధ పోరాటం ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ ప్రాంతం అభివృద్ధి వెనుక 4000 మంది సాయుధ పోరాట అమరవీరుల త్యాగాలు ఉన్నాయన్నారు. నాడు నిజాం సర్కారు ప్రజలపై బలవంతంగా ఉర్దూ భాషను రుద్దినట్లే.. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశ ప్రజలపై బలవంతంగా హిందీ భాషను రుద్దడానికి ప్రయత్నిస్తోందన్నారు. అప్పట్లో నిజాం అవలంబించిన ఫాసిస్టు విధానాలనే నేడు ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ అవలంబిస్తున్నాయన్నారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు రైతాంగ సాయుధ పోరాటాన్ని వక్రీకరిస్తూ హిందూ, ముస్లిం వివాదంగా మార్చడానికి ప్రయత్నం చేస్తుందన్నారు. తెలంగాణ పోరాటాలపై తప్పుడు వక్రీకరణలు చేస్తే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌లకు తెలంగాణ విముక్తి పోరాటంలో ఏం హక్కు ఉందని ప్రశ్నించారు. చదువు లేని ఆడవారికి ఓటు హక్కు వద్దన్న వ్యక్తులు.. నేడు దేశాన్ని పాలిస్తూ ఓటరు జాబితాలను తారుమారు చేస్తున్నారని విమర్శించారు. ఓటరు జాబితాలో మైనార్టీలు, ఆడవారితో పాటు తమకు వ్యతిరేకంగా వ్యవహరించిన వారి పేర్లు తీసేస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో డబ్బు, కులం, మతం పేరిట గెలవాలని చూస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వ రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి ప్రయత్నిస్తోందన్నారు. ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ ఆడవారు ఇంటికి సేవలు అధికంగా చేయాలని అనడం ఆయనలోని ఫాసిస్టు విధానాలకు తార్కాణమన్నారు. అనంతరం సీపీఎం నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ.. పోరాట వీరురాలు చాకలి ఐలమ్మ వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 10 నుంచి 17వ తేదీ వరకు తెలంగాణ రైతాంగ సాయుధ విప్లవ పోరాటాల వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లాలో సుమారు 30 తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట కేంద్రాలు ఉన్నాయని, వాటిల్లో సభలు, సమావేశాలు నిర్వహించాలన్నారు. కళాకారులు పోరాట చరిత్రను కళారూపాల ద్వారా ప్రజలకు అర్థమయ్యేటట్లు చేయాలన్నారు. ప్రజానాట్యమండలి కళాకారులు పాడిన పాటలు ఆకట్టుకున్నాయి. ఈ సదస్సులో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, జి.శ్రీనివాస్‌చారి, నాయకులు గూడూరు అంజిరెడ్డి, మాయ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ పార్టీది అవకాశవాద రాజకీయం

సాక్షి యాదాద్రి : కీలకమైన ఉప రాష్ట్రపతి ఎన్నిక సమయంలో బీఆర్‌ఎస్ పార్టీ అవకాశవాదంగా వ్యవహరించిందని సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు విమర్శించారు. మంగళవారం భువనగి జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవనంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయాన్ని రక్షించేందుకు, రాజ్యాంగంలోని మౌలిక విలువలను కాపాడేందుకు ప్రతిపక్షాలు జస్టిస్ సుదర్శన్‌రెడ్డికి మద్దతుగా నిలిచాయన్నారు. ఎన్నికకు దూరంగా ఉండి బీఆర్‌ఎస్ పార్టీ పరోక్షంగా బీజేపీకి మద్దతు ఇచ్చిందని విమర్శించారు. రాష్ట్రాలకు అమ్మకం పన్ను అనేది ముఖ్యమైన ఆదాయమని, జీఎస్టీ వచ్చిన తర్వాత కేంద్రం.. రాష్ట్రాలకు రావాల్సిన ఆదాయానికి గండి కొట్టిందన్నారు. దేశంలో రెండు విధానాల జీఎస్టీ అమలు చేయాలంటే రాష్ట్ర ప్రభుత్వాలకు నష్టపరిహారం కేంద్రం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఇప్పటికే ప్రభుత్వాలకు ఆర్థిక వనరులు చాలా కష్టంగా ఉన్నాయన్నారు. తెలంగాణకు రూ.9వేల కోట్ల నష్టం వాటిల్లుతోందని ఆర్థిక శాఖ కమిషన్ వెల్లండించిన విషయాన్ని రాఘవులు గుర్తుచేశారు. నీటి వాడకం ఎక్కువ ఉండే పంటలను తగ్గించేందుకు యూరియాను కంట్రోల్ చేసి రైతుల బలవంతం గా పంటల మార్పిడి విధానం తేవాలని చూస్తుందని కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించారు.

15న ఎంజీయూ స్నాతకోత్సవం

- ముఖ్యఅతిథులుగా హాజరుకానున్న గవర్నర్, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్
- 57 మందికి గోల్డ్ మెడల్స్, 22 మందికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేయనున్నట్లు వెల్లడించిన వీసీ


వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీ నాల్గో స్నాతకోత్సవాన్ని ఈ నెల 15న నిర్వహించనున్నట్లు వైస్ ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ తెలిపారు. యూనివర్సిటీలోని తన ఛాంబర్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, ఐఐటీ హైదరాబాద్ డైరెక్టర్ బీఎస్‌మూర్తి ముఖ్యఅతిథులుగా హాజరుకానున్నట్లు తెలిపారు. వారి చేతుల మీదుగా 22 మంది పీహెచ్‌డీ పరిశోధకులకు, 57 మంది విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ అందజేస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా ఎంజీయూ పరిధిలోని కళాశాలల్లో 2022-23, 2023-24 విద్యా సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన 16,210 మందికి, పీజీ పూర్తిచేసిన 3,200 మందికి, బీఈడీ పూర్తి చేసిన 7,800 మందికి పట్టాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో కొత్తగా లా కాలేజీ, ఫార్మసీ కాలేజీ ఏర్పాటుకు అనుమతి లభించిందని, రానున్న రోజుల్లో మరో మూడు కొత్త కోర్సులు వస్తాయని స్పష్టం చేశారు. 2007లో 500 మందితో ప్రారంభమైన ఎంజీయూలో ప్రస్తుతం 2500 మంది విద్యార్థులు చదువుతున్నారని తెలిపారు. మొత్తం 18 డిపార్ట్‌మెంట్లు ఉండగా వాటిలో 12 కోర్సుల్లో సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులు ఉన్నట్లు తెలిపారు. యూనివర్సిటీకి మొత్తం 70 పోస్టులు మంజూరు కాగా.. 35 మందిని తీసుకున్నారని, మిగతా పోస్టుల్లో 46 మందిని కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించారని తెలిపారు. రూ.60 కోట్లతో వసతి గృహాలు, రూ.12 కోట్లతో అడ్మినిస్ట్రేషన్ భవన్ నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. అకడమిక్ సంస్కరణల్లో భాగంగా 75 శాతం హాజరు తప్పనిసరి చేశామని, విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపు కోసం వివిధ సంస్థలతో ఒప్పందం చేసుకున్నట్లు వివరించారు. ప్రస్తుతం ఎంజీయూకి న్యాక్ బీ ప్లస్ ర్యాంకు ఉందని, 2028 నాటికి న్యాక్ ఏ ప్లస్ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఎంజీయూ సీఓఈ జి. ఉపేందర్‌రెడ్డి, లక్ష్మీ ప్రభ, సంధ్యారాణి, ప్రవళిక పాల్గొన్నారు.

ఎంజీ యూనివర్సిటీలో కబడ్డీ పోటీలు


గెలుపొందిన పురుషుల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న యూనివర్సిటీ అధికారులు

నల్లగొండ టూటౌన్: నల్లగొండలోని మహాత్మాగాంధీ యూనివర్సిటీలో మంగళవారం యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ ఆధ్వర్యంలో అంతర్ కళాశాల కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో మహిళల విభాగంలో సోషల్ వెల్ఫేర్ ఆర్మీ డిగ్రీ కళాశాల, భువనగిరి విద్యార్థినులు మొదటి స్థానంలో నిలువగా.. పురుషుల విభాగంలో కేఆర్ డిగ్రీ కళాశాల, మిర్యాలగూడ విద్యార్థులు విజయం సాధించారు. అదేవిధంగా మహిళల విభాగంలో రన్నరప్‌గా సోషల్ వెల్ఫేర్ డిగ్రీ కళాశాల, నల్లగొండ, పురుషుల విభాగంలో రన్నరప్‌గా ఎన్జీ కళాశాల, నల్లగొండ విద్యార్థులు నిలిచారు. గెలుపొందిన జట్లకు యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ హరీష్‌కుమార్, జి. ఉపేందర్ రెడ్డి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ వై. ప్రశాంతి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మురళి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

మూసీకి కొనసాగుతున్న వరద

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద కొనసాగుతూనే ఉంది. మంగళవారం ప్రాజెక్టులోకి 1,280 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా.. అధికారులు ఒక క్రస్టు గేటును పైకెత్తి 1,155 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు గరిష్ట స్థాయి నీటిమట్టం 645 అడుగులు కాగా ప్రస్తుతం 643.50 అడుగుల మేర నీటిమట్టం ఉంది. కుడి, ఎడమ కాల్వలకు 575 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సీపేజీ, లీకేజీ, ఆవిరి రూపంలో 60 క్యూసెక్కుల నీరు వృథా అవుతోంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా 4.07 టీఎంసీల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

మెట్ట వరి సాగుతో బహుళ ప్రయోజనాలు

- భారతీయ వరి పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త పద్మావతి


అవగాహన కల్పిస్తున్న భారతీయ వరి పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త పద్మావతి

త్రిపురారం: మెట్ట వరి సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని భారతీయ వరి పరిశోధనా స్థానం సీనియర్ శాస్త్రవేత్త పద్మావతి అన్నారు. మంగళవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే), భారతీయ వరి పరిశోధనా స్థానం, రాజేంద్రనగర్ సంయుక్త ఆధ్వర్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సౌజన్యంతో నల్లగొండ జిల్లాలోని రైతులకు వరి సాగులో యాజమాన్య పద్ధతులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త పద్మావతి వరిలో మొగి పురుగు నిర్మూలన, సమగ్ర యాజమాన్యం, మొగి పురుగు గుర్తించే పద్ధతులతో పాటు లింగాకర్షక బుట్టలు వరి పొలంలో ఉపయోగించే విధానం, వాటి ప్రయోజనాలను తెలియజేశారు. మెట్ట వరి సాగులో కలుపు యాజమాన్యం అత్యంత కీలకమని ఆమె రైతులకు సూచించారు. రైతులకు లింగాకర్షక బుట్టలు పంపిణీ చేశారు. అనంతరం నీలాయిగూడెం గ్రామంలో రైతు కంచి సోమయ్య సాగు చేసిన మెట్ట వరి పొలాన్ని రైతులతో కలిసి ఆమె పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ చంద్రశేఖర్, యంగ్ ప్రొఫెషనల్స్ సుష్మ, అజయ్, సాయికుమార్, శ్రీకాంత్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉదయ్‌పూర్‌లో తెలంగాణ టీచర్ల ప్రదర్శన


ప్రదర్శన ఇస్తున్న తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయులు

నకిరేకల్: రాజస్తాన్ రాష్ట్రంలోని ఉదయ్‌పూర్‌లో గల సాంస్కృతిక వనరుల కేంద్రంలో జరుగుతున్న జాతీయ స్థాయి ఉత్తమ సాధక ఉపాధ్యాయుల శిక్షణలో తెలంగాణ రాష్ట్రం నుంచి పాల్గొన్న ఉపాధ్యాయులు మన రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలపై నృత్య రూపకాన్ని ప్రదర్శించారు. ఈ బృందానికి నకిరేకల్ మండలం చందంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల హెచ్‌ఎం కనుకుంట్ల నవీన్‌రెడ్డి సారథిగా వ్యహరించి ప్రశంసలు అందుకున్నారు. మొత్తం 13 రాష్ట్రాల ఉపాధ్యాయులు పాల్గొని వివిధ ప్రదర్శనలు ఇచ్చారు. 14వ రోజు తెలంగాణ బృందం గ్రామీణ ప్రజల పని సంస్కృతి(ఊరు మనదిరా) బోనాలు, బతుకమ్మ, బంజారా నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఈ ప్రదర్శనను సీసీఆర్టీ అధికారులు అభిషేక్ సర్కార్, హితేష్, పవెరి అభినందించారు. ఈ ప్రదర్శనలో తనతో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి మాదరి ఎల్లన్న, పి. రఘురాం, జి. వెంకటేష్, ఈశ్వరయ్య, వి. అంజని, జయంత్‌కుమార్, ఎ. సౌజన్య, నిఖత్ ఫాతిమా, డి. రమేష్ పాల్గొన్నారని నవీన్‌రెడ్డి తెలిపారు.

సాగర్‌కు తగ్గిన ఇన్‌ఫ్లో


రెండు గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ జలాశయానికి ఎగువ నుంచి వస్తున్న వరద తగ్గింది. ప్రస్తుతం 70,038 క్యూసెక్కుల వరద నీరు సాగర్ జలాశయానికి వచ్చి చేరుతుండగా.. అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. రెండు గేట్ల ద్వారా 16,012 క్యూసెక్కులు, విద్యుదుత్పాదనతో 32,277 క్యూసెక్కులు మొత్తం 48,289 క్యూసెక్కుల నీటిని దిగువన కృష్ణా నదిలోకి విడుదల చేస్తున్నారు. అదేవిధంగా కుడి, ఎడమ కాల్వలు, ఏఎమ్మార్పీ, వరద కాలువలకు 21,819 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ జలాశయం గరిష్ట స్థాయి నీటిమట్టం 590 అడుగులు (312.0450 టీఎంసీలు) కాగా ప్రస్తుతం నీటిమట్టం 589.10 అడుగులు (309.3558 టీఎంసీలు)గా ఉంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

- మరో ఇద్దరికి గాయాలు

గరిడేపల్లి, మేళ్లచెరువు: ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా.. ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామ శివారులో మంగళవారం జరిగింది. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. చింతలపాలెం మండలం యర్రకుంట తండాకు చెందిన భూక్య భగ్యా(60) తన కుమారుడు భూక్య కృష్ణ, బంధువు ధరావత్ కమిలితో కలిసి మంగళవారం ద్విచక్ర వాహనంపై మిర్యాలగూడ మండలం అవంతిపురం సంతకు గొర్రె పొట్టేళ్లు కొనుగోలు చేసేందుకు వెళ్లారు. అక్కడ బేరం కుదరకపోవడంతో తిరిగి హుజూర్‌నగర్ మీదుగా యర్రకుంట తండాకు వెళ్తున్నారు. ఈ క్రమంలో హుజూర్‌నగర్ నుంచి మిర్యాలగూడ వైపు కారులో అతివేగంగా వెళ్తున్న కుమ్మరికుంట ప్రణయ్ గరిడేపల్లి మండలం రాయినిగూడెం గ్రామ శివారులో వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం హుజూర్‌నగర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో భూక్య భగ్యా మృతిచెందాడు. కృష్ణ, కమిలిని మెరుగైన వైద్యం కోసం కోదాడకు తరలించారు. మృతుడి భార్య భూక్య తిర్పి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ ఘటనతో యర్రకుంట తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చేనేత కార్మికుడి ఆత్మహత్య


క్రాంతి (ఫైల్)

సంస్థాన్ నారాయణపురం: ఇంటి కొనుగోలు కోసం చేసిన అప్పులు తీర్చే మార్గం కానరాక మనస్తాపంతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామానికి చెందిన పానగంటి క్రాంతి(28) చేనేత కార్మికుడుగా పనిచేస్తున్నాడు. మూడు సంవత్సరాల క్రితం గ్రామంలో ఇల్లు కొనుగోలు చేశాడు. ఆ తర్వాత తాను, వివాహం చేసుకున్నాడు. రెండు సంవత్సరాల నుంచి చేనేత పనులు అంతంతమాత్రంగానే ఉండడంతో కుటుంబ పోషణకు కూడా అప్పులు చేసినట్లు గ్రామస్తులు చెప్పారు. మొత్తంగా క్రాంతికి ప్రస్తుతం సుమారు రూ.15లక్షల అప్పులు ఉన్నట్లు తెలిసింది. చేనేత మీద వచ్చే సంపాదన కుటుంబ పోషణకు సరిపోవడం లేదు. ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతుండటం, అప్పులు ఎలా తీర్చాలో తెలియక మనస్తాపానికి గురయ్యాడు. సోమవారం గ్యాస్ సిలిండర్ తీసుకుని వస్తానని గ్రామం నుంచి సంస్థాన్ నారాయణపురం వెళ్లాడు. అక్కడ గడ్డి నివారణ మందు కొనుగోలు చేసి, అక్కడే తాగి ఇంటికి వచ్చాడు. ఇంటి వద్ద వాంతి చేసుకోవాడానికి ప్రయత్నం చేశాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని చౌటుప్పల్ ప్రభుత్వ ఆసుప్రతికి తరలించారు. అక్కడ నుంచి నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం హైదారాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగన్ తెలిపారు.

ఆటోను ఢీకొట్టిన గూడ్స్ వాహనం

- 8మంది కూలీలకు గాయాలు

చివ్వెంల(సూర్యాపేట): అతివేగంగా వస్తున్న గూడ్స్ వాహనం ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న 8మంది కూలీలకు గాయాలయ్యాయి. ఈ ఘటన చివ్వెంల మండలం అక్కలదేవిగూడెం గ్రామ శివారులో సూర్యాపేట-ఖమ్మం రహదారిపై మంగళవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నూతన్‌కల్ మండలం పెద్దనెమిల గ్రామానికి చెందిన కూలీలు మంగళవారం ఉదయం పత్తి చేనులో కూలి పని కోసం మోతె మండల కేంద్రానికి ఆటోలో వెళ్లారు. సాయంత్రం తిరిగి అదే ఆటోలో స్వగ్రామానికి వస్తుండగా.. మార్గమధ్యలో అక్కలదేవిగూడెం గ్రామ శివారులో ఖమ్మం నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న అశోక్ లేలాండ్ వాహనం ఆటోను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది కూలీలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో సూర్యాపేట జనరల్ హాస్పిటల్‌కు తరలించారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణంగా తెలుస్తోంది. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

మద్యం మత్తులో స్నేహితుల మధ్య ఘర్షణ

- కత్తులతో దాడి.. ఇద్దరికి గాయాలు

కోదాడరూరల్: మద్యం మత్తులో మాటమాట పెరిగి స్నేహితుల మధ్య ఘర్షణ తలెత్తి కత్తులతో దాడి చేసుకున్నారు. ఈ ఘటన కోదాడ మండలం గుడిబండ గ్రామంలో సోమవారం అర్ధరాత్రి జరిగింది. కోదాడ రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుడిబండ గ్రామ పంచాయతీకి చెందిన సోమపంగు ప్రసాద్, కొండపల్లి రాజేష్, కొంపడల్లి రాకేష్, కొలకొండ గోపి, సంపంగి జీవన్, తొగర్రాయి గ్రామ పంచాయతీకి చెందిన తిరుపయ్య స్నేహితులు. వీరందరు సోమవారం రాత్రి గుడిబండ గ్రామ పరిధిలో కోదాడ-మేళ్లచెరువు ప్రధాన రహదారిపై మద్యం సేవిస్తున్నారు. మద్యం సేవించిన తర్వాత వారి మధ్య మాటమాట పెరిగి గోపి, జీవన్‌తో ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణలో గోపి, జీవన్‌పై మిగిలిన నలుగురు వ్యక్తులు కత్తులతో దాడి చేయడంతో వారికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు గాయపడిన వారిని కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై బాధితుడు గోపి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు కోదాడ రూరల్ పోలీసులు తెలిపారు.

వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని దాడి

మేళ్లచెరువు: భార్యను వదిలి వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిపై అతడి భార్య తరపు బంధువులు దాడి చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన సయ్యద్ ఖాజామియా తన భార్యను వదిలి వేరొక మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం తెలిసి మంగళవారం భార్య తరపు బంధువులు ఖాజామియాపై దాడి చేశారు. తన భార్యతో పాటు వారి బంధువులే తనపై దాడికి కారణమని బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

తమ్ముడికి సాయంగా అక్క


- సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నల్లగొండ

సూర్యాపేట జిల్లా పరిధిలోని పెన్‌పహాడ్‌కు చెందిన చాగంటి లింగమ్మ, ఆమె తమ్ముడు యేసు ఎన్నో సంవత్సరాలుగా నల్లగొండ జిల్లా కేంద్రంలో ఉంటున్నారు. లింగమ్మకు ఎడమ కాలు లేకపోవడంతో కృత్రిమ కాలు ఏర్పాటు చేసుకుంది. కుష్టు వ్యాధితో బాధపడుతున్న తన తమ్ముడు యేసును మంగళవారం నల్లగొండ జిల్లా కేంద్రం ఆస్పత్రిలో చూపించేందుకు గాను ఆమె కత్రిమ కాలు, చేతి కర్ర సాయంతో ట్రైసైకిల్‌ను లాగుతూ తీసుకొచ్చింది. ఈ ఘటన అక్కడున్న వారిని కలచివేసింది. ట్రైసైకిల్ పూర్తిగా పాడైందని, ప్రభుత్వం కొత్త ట్రైసైకిల్ ఇప్పించాలని వారు కోరుతున్నారు.

ఉత్తరప్రదేశ్ ప్రజాప్రతినిధుల పర్యటన



రామన్నపేట: వెల్లంకి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఉత్తరప్రదేశ్ సర్పంచులు, ఎంపీటీసీలు


చౌటుప్పల్ రూరల్: దేవలమ్మ నాగారం గ్రామంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్ర సర్పంచుల బృందం

రామన్నపేట, చౌటుప్పల్ రూరల్: ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు మంగళవారం రామన్నపేట మండలంలోని వెల్లంకి గ్రామాన్ని, చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం గ్రామాన్ని సందర్శించారు. ఆ రాష్ట్ర డీపీఆర్‌ఓ బులానంద్ సహాన్, డీపీఓ నవీన్‌మిత్ర సారథ్యంలో 30మంది ప్రజాప్రతినిధులు వెల్లంకి గ్రామ అభివృద్ధి పనులు, పారిశుద్ధ్యం నిర్వహణ, మౌలిక వసతుల కల్పన, పంచాయతీ కార్యాలయం నిర్వహణను పరిశీలించారు. రైతువేదికలో గ్రామస్తులతో సమావేశమై పలు అంశాలపై చర్చించారు. గ్రామంలో ప్రజలకు అందుతున్న సంక్షేమ పథకాలు, ప్రభుత్వం రైతులకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై ఆరా తీశారు. అనంతరం ఆచార్య కూరెళ్ల గ్రంథాలయాన్ని సందర్శించారు. వారి వెంట అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్, ఎంపీడీఓ రాములు, ఎంపీఓ రవూఫ్‌అలీ, ఏఈలు గాలయ్య, ఆశిష్‌రాఘవ, ఏపీఓ వెంకన్న, టీఏ సుచరిత, పంచాయతీ కార్యదర్శులు ఉన్నారు.

దేవలమ్మ నాగారం గ్రామం సందర్శన..

ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఆయా జిల్లాల నుంచి ఒక్కొక్కరి చొప్పున 30 మంది సర్పంచులు తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్‌లో ట్రైనింగ్ తీసుకోవడానికి హైదరాబాద్‌కు వచ్చారు. 2024లో హెల్త్ పంచాయతీ విభాగంలో చౌటుప్పల్ మండలంలోని దేవలమ్మ నాగారం జాతీయ స్థాయిలో నామినేట్ అయిన నేపథ్యంలో హెల్త్ పంచాయతీ విభాగంలో తీసుకుంటున్న చర్యలను అధ్యయనం చేయడానికి వారు ఈ గ్రామాన్ని సందర్శించారు. ఇక్కడ అమలుచేస్తున్న పథకాలను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట యూపీ రాష్ట్రానికి చెందిన జిల్లా పంచాయతీ అధికారి శ్రీవాత్సవ్, ట్రైనింగ్ కన్సల్టెంట్ అశ్విన్‌కుమార్, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ అనిల్‌కుమార్, అడిషనల్ డీఆర్‌డీఓ సురేష్, ఎంపీడీఓ సందీప్‌కుమార్, డీఎల్‌పీఓ ప్రతాప్‌నాయక్, ఎంపీఓ అంజిరెడ్డి, పీఆర్ ఏఈ నితీష్, వైద్యాధికారి డాక్టర్ శివ తదితరులు పాల్గొన్నారు.

'మట్టపల్లి' హుండీల లెక్కింపు

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఈ ఏడాది మే 15నుంచి ఈ నెల 8వ తేదీ వరకు హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలను మంగళవారం లెక్కించారు. దేవస్థానం హుండీల ద్వారా రూ.20,86,660, అన్నదానం హుండీ ద్వారా రూ.53,380 మొత్తం రూ. 21,40,040 ఆదాయం సమకూరినట్లు ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్‌లు స్థానికంగా విలేకరులకు వెల్లడించారు. కార్యక్రమంలో దేవాదాయ శాఖ పర్యవేక్షణ అధికారి వెంకటాచలపతి, సాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.